క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



సూర్యనారాయణరెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

పెద్దవడుగూరు : లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య గురువారం ఆయన్ను పరామర్శించారు.

పెనకచెర్లలో అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన

గార్లదిన్నె: పెనకచెర్లలో గురువారం అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ పర్యటించారు. స్పందన కార్యక్రమంలో భూ సమస్యకు సంబంధించి ఫిర్యాదు రావడంతో ఆయన గ్రామంలో పర్యటించి ఇద్దరు రైతుల పొలాలు పరిశీలించి రైతుల సాగు మేరకు విస్తీర్ణం వివరాలు అందజేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అలాగే మరొక చోట అన్నదమ్ములు మధ్య రస్తా వివాదం ఉంటే పరిశీలించి, రస్తా సబ్ డివిజన్ చేసుకొని సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: స్థానిక కొత్త బ్రిడ్జి సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నేత ఫెరోజ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాబాషా, అన్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దవడుగూరు వైఎస్సార్ సీపీ నేత గూడూరు సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు.

జన సంక్షేమమే జగనన్న లక్ష్యం

యాడికి: జన సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు పెద్దపేట లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. మండలకేంద్రంలో నం-1 సచివాలయ కన్వీనర్ దూద్‌వలి, 18వ వార్డు సభ్యురాలు లక్ష్మి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. నాయకులు రామకృష్ణారెడ్డి. సుధాకర్, భాస్కర్, ఫరూక్, 12వ వార్డు సభ్యురాలు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: జగనన్న పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, ఈవిషయాన్ని ప్రజలు గుర్తించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్సీపీ నాయకులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలతో ప్రజలకు కలిగిన లబ్ధిని తెలియజేశారు. నాలుగేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన జగనన్నకు ప్రజలు వెన్నంటి నడవాలని కోరారు. జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.



వైటీ చెరువులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: నీలూరు గ్రామంలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ బీ ప్రమీలమ్మ, వైఎస్సార్‌సీపీ కిసాన్ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి బీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లుటౌన్: వేసవిలో అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి కెపి.లింగమయ్య సూచించారు. గురువారం అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట తయారు చేసే సమయంలో ప్రమాదవశాత్తు ఎల్‌పీజీ సిలిండర్ నుంచి అగ్నిప్రమాదం సంభవిస్తే ఆ మంటలను ఏ విధంగా ఆర్పివేసి ప్రమాదాన్ని నియంత్రించాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలనే అంశంపై అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కౌన్సిలర్ మెహరున్నీసా, సీడీపీఓ నాగమణి పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో గురువారం అగ్నిమాపక వారోత్సవాలు ముగిశాయి. ఈసందర్భంగా గ్యాస్ స్టవ్, అగ్ని, సహజ ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ ద్వారా విద్యార్థులు, మహిళలకు ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ అధికారి మోహన్ బాబు, అగ్నిమాపక సిబ్బంది రామయ్య, రామాంజనేయులు, నవీన్, షకీల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

గుత్తి: పట్టణంలోని 17వ వార్డులో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు గ్రానైట్ శివ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ 200 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత గ్రానైట్ శివ మాట్లాడుతూ పేదలు కూడా పండగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో రంజాన్ తోఫా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ దస్తగిరి, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, కౌన్సిలర్ కేవీ రమణ, సీనియర్ నాయకులు మర్తాడు అన్సార్, బేడల వెంకటరాముడు, డాక్టర్ నాగేంద్ర, షఫి వార్డు నాయకులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక కార్మిక వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం కార్మికులకు రంజాన్ తోఫాను అసోసియేషన్ సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రానైట్, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు రఫిక్, వెంకట్, గౌస్ బేగ్, హాజీ, ఎస్ ఎస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



గుత్తి: రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న దృశ్యం

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: వెంకటాంపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జాషువా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

డ్రిప్పు దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలి

నార్పల: మండల కేంద్రంలోని పలు పంట పొలాల్లో డ్రిప్పు పరికరాలను అపహరిస్తున్న దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు డ్రిప్పు పరికరాలు బాధిత రైతులు వెళ్లి డ్రిప్పు పరికరాలు దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు రామాంజి,భరత్, అంజి,శ్రీకాంత్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల తనిఖీ

పుట్లూరు: మండలంలోని తక్కళ్లపల్లి, పుట్లూరు, శనగలగూడూరు గ్రామ సచివాలయాలను గురువారం ఎంపీడీఓ యోగానందరెడ్డి తనిఖీ చేశారు. ఆయా గ్రామ సచివాలయాల్లో రికార్డులను పరిశీలించి, స్పందన కార్యక్రమం నిర్వహణ తీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయా సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

యాడికి: మండలంలోని టి.కొత్తపల్లెకు చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య లావణ్య (36) గత బుధవారం మధ్యాహ్నం చిన్న కుమారుడితో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల గాలించిన ఫలితం లేకపోయింది. గురువారం శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కార్మికశాఖ రుసుము సచివాలయాల్లో చెల్లించాలి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వ్యాపారులు, ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు కార్మికశాఖకు సంబంధించిన రుసుములు వార్డు సచివాలయాలు లేదా మీసేవా కేంద్రాల్లో మాత్రమే చెల్లించాలని గుంతకల్లు సహాయ కార్మికశాఖ అధికారి శివప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు తాము లేబర్ ఆఫీసర్లమంటూ వ్యాపారులకు ఫోన్ చేసి ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంల ద్వారా రుసుములు చెల్లించాలని వ్యాపారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. లేబర్ ఆఫీసర్ పేరిట అపరిచిత వ్యక్తులెవరైనా ఫోన్ చేస్తే వెంటనే 9492555193కి కాల్ చేయడమో లేదా ఆఫీసులో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు రైతులకు అండగా నిలవాలి

బుక్కరాయసముద్రం: వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతాంగానికి అండగా నిలవాలని పుట్టపర్తి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం పి.కొత్తపల్లిలో తిరుపతి వ్యవసాయ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. డాక్టర్ రామసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ రంగంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అగ్రికల్చర్ కళాశాలలో నేర్చుకున్న వ్యవసాయ విద్యను రైతాంగ అభివృద్ధి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవికిశోర్, తిరుపతి వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్, విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని చెరువు కట్ట వద్ద గురువారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గుంతకల్లు మండలం పాతకొత్తచెరువుకు చెందిన గోపాల్ ఆటోలో గుత్తికి బయలు దేరాడు. అయితే గుత్తి చెరువు కట్ట వద్ద ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో గోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌లో గోపాల్‌ను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అసెంబ్లీ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి



ఎమ్మెల్యే వైవీఆర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏబీఎస్ఎస్ నాయకులు

గుంతకల్లుటౌన్: బోయ, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ ఏపీ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని ఆలిండియా బంజారా సేవా సంఘం నాయకులు కోరారు. గురువారం ఏబీఎస్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వైవీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్‌ను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి అన్ని రంగాల్లో వెనుకబడిన గిరిజనులకు అన్యాయం జరగకుండా చూడాలని విన్నవించారు. ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణా నాయక్, గుత్తి మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు సోవిత్, దీప్లానాయక్, గోపాల్‌నాయక్, లాలూనాయక్, రంగానాయక్, రాజేష్‌నాయక్, హరినాయక్, హేమంత్ నాయక్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

గుత్తి: మే 13న తలపెట్టిన జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఏడీజే కబర్ది పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏడీజే కోర్టులో గురువారం పోలీసు అధికారులు, న్యాయవాదులు, ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశమున్న కేసులన్నింటినీ పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌కు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి విజయకుమార్‌రెడ్డి, సీఐ వెంకటరామిరెడ్డి, న్యాయవాదులు ఫక్కృభాషా, కుమార్, ఓబులేసు, నూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

గుత్తి రూరల్: మునిసిపాలిటీతో పాటుగా మండల వ్యాప్తంగా ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మహబూబ్ బాషా హెచ్చరించారు. గురువారం కార్యాలయంలో తహసీల్దార్ ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుత్తి మునిసిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి పొలం సర్వే నంబర్ 122-సీ1లోని ప్రభుత్వ భూమిలో కొనుగోలు, అమ్మకాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. 35.21 ఎకరాల విస్తీర్ణంలోని మొత్తం భూమి వ్యవసాయ నిమిత్తం రైతులకు అసైన్ చేశామన్నారు. అలాంటి భూములను ఎవరూ అమ్మడానికి, కొనడానికి వీలు లేదన్నారు. అలాగే లచ్చానుపల్లి రోడ్డులో సర్వే నంబర్ 644-4, 644-5లోని 5.70 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు టెంకాయ మొక్కలు నాటి ఆక్రమించుకున్నట్లు తమ దృష్టికి రాగా వాటిలో మొక్కలు తొలగించామన్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో డ్రైనేజీలు నిర్మించండి

గుంతకల్లుటౌన్: హౌసింగ్ బోర్డు కాలనీలో డ్రైనేజీలను నిర్మించాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కోరారు. గురువారం కమిషనర్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి వార్డులో పర్యటించారు. మున్సిపాల్టీకి తాము సక్రమంగా పన్నులు చెల్లిస్తున్నా డ్రైనేజీలు వేయట్లేదని స్థానికులు కమిషనర్‌కు తెలిపారు. రోడ్డు స్థలాన్ని ఆక్రమిస్తే డ్రైనేజీలను వేయడం కుదరదని, ఆక్రమణలను తొలగించుకుంటే తప్పనిసరిగా వేయిస్తామని కమిషనర్ చెప్పారు. అంతకుముందు కమిషనర్ 30వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఇంటింటా చెత్తసేకరణ గురించి ప్రజలను ఆరాతీశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఏఈ శ్రీకాంత్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీ, మాజీ కౌన్సిలర్ సుంకప్ప పాల్గొన్నారు.

తాగునీటి పథకం మోటార్ అపహరణ

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డిలో గ్రామానికి తాగునీరు సరఫరా చేసే విద్యుత్ మోటారు చోరీకి గురైంది. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బోరు గ్రామ శివారులో వర్మీ కంపోస్టు యార్డు వద్ద ఉంది. అయితే బోరుకు సంబంధించిన విద్యుత్ మోటారు, స్విచ్ బోర్డు, వైరు, పైపులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. గురువారం ఉదయం గ్రామానికి నీటిని సరఫరా చేసేందుకు వెళ్లిన పంచాయతీ సిబ్బంది గమనించి విషయాన్ని సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ వీరన్న గౌడ్‌కు తెలిపారు. ఘటనపై ఎంపీటీసీ వీరన్న సీఐ వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామంలో వెంటనే మోటారును ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడి తీర్చాలని ఎంపీటీసీ గ్రామస్తులతో కలిసి ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.

ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌ల్లో దోపిడీ అరికట్టాలి

గుంతకల్లుటౌన్: ప్రజల అనారోగ్యాల్ని అవకాశంగా తీసుకుంటున్న పట్టణంలోని పలు నర్సింగ్‌హోమ్‌ల నిర్వాహకులు ప్రజలను దోపిడీ చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని ప్రజారోగ్య దోపిడీ నిరోధక సంస్థ సభ్యులు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమెను సదరు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు హరిప్రసాద్‌యాదవ్, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు నబీరసూల్, సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు హొన్నూరప్ప, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.